సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం । 3 । మే । 2025



అంతర్ జిల్లా దొంగల అరెస్టు

అంతర్ జిల్లా దొంగల ముఠాకు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి నగదు, నగలు, వస్తువులు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు.


10లో



బీచ్ కబడ్డీ పోటీలు ప్రారంభం

ఏపీ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సీనియర్ మెన్ అండ్ వుమెన్స్ అంతర జిల్లాల బీచ్ కబడ్డీ పోటీలు కాకినాడ సాగర తీరాన ప్రారంభమయ్యాయి.

కడలిలోకి 1,951 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం 1,951 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.70 అడుగులుగా నమోదైంది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

విశ్వరూప్‌ను కలిసిన జగ్గిరెడ్డి



విశ్వరూప్‌ను సత్కరిస్తున్న జగ్గిరెడ్డి

కొత్తపేట: వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ (పీఏసీ) సభ్యుడు, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్‌ను కొత్తపేట మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి, సత్కరించారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలూ జిల్లాలో పార్టీని బలోపేతం చేయడం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయకుండా దగా చేయడం, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడటం, ప్రజల తరఫున ప్రభుత్వంపై పోరాటం వంటి అంశాలపై చర్చించారు. జిల్లాలో నియోజకవర్గాల వారీగా పర్యటిస్తూ, అందరినీ సమన్వయం చేసుకుంటూ, నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సహకారంతో పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు సమష్టిగా కృషి చేద్దామని అన్నారు.


కులగణనకు శ్రీకారం చుట్టింది జగన్ మాత్రమే

అమలాపురం టౌన్: గతంలో కులగణనకు శ్రీకారం చుట్టిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనని ఎమ్మెల్సీ, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. స్థానిక హైస్కూలు సెంటరులోని తన క్యాంపు కార్యాలయంలో బీసీ నాయకులతో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి బీసీ సంక్షేమ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అధ్యక్షతన సమగ్ర కుల గణన సర్వేకు కమిటీ వేసింది అప్పటి సీఎం వైఎస్ జగనేనని గుర్తు చేశారు. కులగణనను వైఎస్సార్ సీపీ స్వాగతిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ఈ ప్రక్రియ నిర్వహణకు రూ.575 కోట్ల కేటాయింపులు ఏ మూలకు సరిపోతాయని ఎమ్మెల్సీ పెదవి విరిచారు. రూ.లక్ష కోట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. గత 75 సంవత్సరాల చరిత్రలో మాజీ ముఖ్యమంత్రి జగన్ 60 కార్పొరేషన్లను బీసీలకు ఏర్పాటు చేశారని, సంచార జాతులతో సహ సామాజిక న్యాయం చేశారని గుర్తు చేశారు. కులగణనతో బీసీలకు, సంచార జాతులకు రాజ్యాంగబద్ధంగా న్యాయం జరుగుతుందని సూర్యనారాయణరావు స్పష్టం చేశారు. సమావేశంలో బీసీ నాయకులు మట్టపర్తి నాగేంద్ర, కుడుపూడి త్రినాథ్, దండుమేను రూపేష్, ముంగర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

6న రాజోలులో మెగా జాబ్ మేళా

అమలాపురం రూరల్: వికాస సంస్థ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, రాజోలు ఏ1 సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ ఉదయం 9 గంటల నుంచి రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. మేళా వాల్‌పోస్టర్‌ను కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ మేళాలో 1,547 పోస్టుల భర్తీకి సుమారు 37 కంపెనీలు పాల్గొంటున్నాయని, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారని వివరించారు. వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ మాట్లాడుతూ, పదో తరగతి నుంచి పీజీ వరకూ విద్యార్హత కలిగిన 35 సంవత్సరాల లోపు వయస్సు వారు అర్హులని చెప్పారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరిశేషు పాల్గొన్నారు.

1.74 లక్షల మందికి 'ఉపాధి'



స్వరూప్

రాయవరం: గత ఆర్థిక సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా 1.74 లక్షల మందికి పని కల్పించామని ఉపాధి హామీ పథకం ఏడీ ఐ.స్వరూప్ తెలిపారు. పసలపూడి, నదురుబాద గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా జిల్లాలోని 385 పంచాయతీల పరిధిలో వివిధ పనులు చేపడుతున్నామని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో 57 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా, 56.80 లక్షలు సాధించామని చెప్పారు. రోజువారీ సగటు వేతనం రూ.291.20 చెల్లించామన్నారు. మొత్తం 12,045 కుటుంబాలు 100 రోజుల పని కల్పించామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 9,653 కాలువల్లో 7,400 కిలోమీటర్ల మేర పూడికతీత పనులు చేపట్టి, రూ.132 కోట్ల వేతనాలు చెల్లించామని వివరించారు. అలాగే 56 చెరువుల పూడికతీత, పునరుద్ధరణ పనుల ద్వారా రూ.3 కోట్ల మేర వేతనాలు చెల్లించామన్నారు. కొబ్బరి తోటల్లో 2,707 ఎకరాల్లో రింగ్ ట్రెంచెస్ పనులు చేపట్టడం ద్వారా రూ.16 కోట్ల వేతనాలు చెల్లించామన్నారు. మొత్తంగా జిల్లాలో గడచిన ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కూలీలకు వేతనాలుగా రూ.165.43 కోట్లు చెల్లించామని తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో భాగంగా మే, జూన్ నెలల్లో 3,415 కిలోమీటర్ల మేర కాలువల్లోను, 59 చెరువుల్లోను పూడికతీత పనులు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ రెండు నెలల్లో 41 లక్షల పనిదినాలు లక్ష్యంగా కార్యాచరణ రూపొందించామని స్వరూప్ తెలిపారు.

డీసీసీబీపై సోషల్ వార్

- చైర్మన్ గిరీపై కూటమిలో కుమ్ములాటలు
- జనసేన పట్టు.. తగ్గేదే లేదంటున్న టీడీపీ
- పవన్ సోదరుడు నాగబాబు లాబీయింగ్
- పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి వైపు మొగ్గు
- బలప్రదర్శనకు సిద్ధమవుతున్న టీడీపీ బీసీలు



కాకినాడలోని డీసీసీబీ కార్యాలయం



మర్రెడ్డి శ్రీనివాస్ | జ్యోతుల నవీన్‌కుమార్ | మెట్ల రమణబాబు | బండారు శ్రీనివాస్ | పిల్లి సత్తిబాబు అనంతలక్ష్మి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) పీఠం కోసం కూటమిలో 'సోషల్' వార్ తారస్థాయికి చేరింది. ఈ చైర్మన్‌గిరీ కోసం కూటమిలోని టీడీపీ, జనసేనలు నువ్వా నేనా అనే రీతిలో తలపడుతున్నాయి. పార్టీల వారీగానే కాకుండా సామాజిక వర్గాలుగా కూడా నేతలు విడిపోయి ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు. సందట్లో సడేమియా అన్నట్లు ఇంతలోనే చైర్మన్ పీఠం జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న మర్రెడ్డి శ్రీనివాస్‌కు ఖాయమైపోయిందంటూ సోషల్ మీడియా వేదికగా ప్రచారం జోరుగా జరుగుతోంది. దీంతో, ఇరు పార్టీల నేతల మధ్య అగ్గికి ఆజ్యం పోసినట్లయింది. ఈ ప్రచారంతో కాకినాడ కేంద్రంగా ఉన్న డీసీసీబీ చైర్మన్‌గిరీ నియామకం కాస్తా రసకందాయంలో పడింది.

ఆ ముగ్గురు..

డీసీసీబీ చైర్మన్ పదవి కోసం టీడీపీలోని రెండు బలమైన సామాజిక వర్గాలు పోటీ పడుతున్నాయి. బ్యాంక్ చరిత్రను తిరగేస్తే అధికారంలో ఏ పార్టీ ఉన్నా చైర్మన్‌గిరీ తమకే దక్కుతోందని ఒక సామాజికవర్గం బలమైన వాదన వినిపిస్తోంది. దీనికి బలం చేకూర్చేలా గతంలో చైర్మన్లుగా పని చేసిన వారి జాబితాను టీడీపీ అగ్రనేతల ముందుంచారని తెలిసింది. టీడీపీలోని ఒక సామాజికవర్గం నుంచి మెట్ల రమణబాబు, జెడ్పీ మాజీ చైర్మన్, పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, కాకినాడ రూరల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ కటకంశెట్టి బాబీ చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. ఒకప్పుడు టీడీపీలో కోనసీమ నుంచి చక్రం తిప్పిన దివంగత మాజీ మంత్రి డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు కుమారుడు రమణబాబుకు ఇవ్వాలని ఆ ప్రాంత నేతలు చేస్తున్న డిమాండ్‌ను మెట్ట ప్రాంత నేతలు తోసిపుచ్చుతున్నారని చెబుతున్నారు. రమణబాబు ఆప్కాబ్ చైర్మన్ పదవి ఆశిస్తున్నారంటూ పార్టీ నేతల మధ్య జరుగుతున్న చర్చను వారు కారణంగా చూపిస్తున్నారని అంటున్నారు. తండ్రి జ్యోతుల నెహ్రూ ఎమ్మెల్యేగా, టీటీడీ సభ్యుడిగా కూడా ఉండటంతో అదే కుటుంబం నుంచి నవీన్‌ను ఎలా పరిగణనలోకి తీసుకుంటారని ఆయన వైరి వర్గం వ్యతిరేకిస్తోంది. ఆవిర్భావం నుంచీ పార్టీ వెన్నంటి నిలిచిన తనకే ప్రాధాన్యం ఇవ్వాలని కటకంశెట్టి బాబీ లాబీయింగ్ చేస్తున్నారు. ఇలా టీడీపీలో ఒకే సామాజికవర్గం నుంచి ముగ్గురు ఆశిస్తున్నారు.

సీన్‌లోకి 'గ్లాస్'మేట్స్

డీసీసీబీ చైర్మన్ గిరీ కోసం టీడీపీలో రెండు బలమైన సామాజికవర్గాలు తలపడుతుండగా.. మూడో పక్షంగా జనసేన సీన్‌లోకి వచ్చింది. ఈ పదవిని ఆ పార్టీ ఎగరేసుకుపోయే ప్రయత్నాలు చివరికొచ్చేశాయని అంటున్నారు. టీడీపీలో తలపడుతున్న రెండు వర్గాలకు చెక్ చెప్పేందుకు మధ్యే మార్గంగా డీసీసీబీని జనసేన కోటాగా ప్రకటించేస్తారనే ప్రచారం కూడా నడుస్తోంది. ఈ మేరకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మధ్య ఒక అంగీకారం కూడా కుదిరిందనే చర్చ జరుగుతోంది. వాస్తవానికి సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తరువాత ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో పశ్చిమ గోదావరి డీసీసీబీని జనసేనకు ఇవ్వాలనేది కూటమి ఒప్పందంగా చెబుతున్నారు. అయితే ఇటీవల ఆ జిల్లా టీడీపీ నేతలు డీసీసీబీ కోసం గట్టిగా పట్టుబట్టారు. దీంతో, అక్కడి డీసీసీబీని టీడీపీకి జనసేన వదిలేసింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ పదవిపై తాజా నిర్ణయం వెనుక పవన్ కల్యాణ్‌పై ఆయన సోదరుడు, ఎమ్మెల్సీ నాగబాబు లాబీయింగ్ పని చేసిందనే వాదన బలంగా వినిపిస్తోంది. పిఠాపురంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మను తొక్కేసే వ్యూహంలో భాగంగా నాగబాబు.. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న మర్రెడ్డి శ్రీనివాస్‌కు డీసీసీబీ చైర్మన్‌గిరీని కట్టబెట్టే ప్రయత్నాల్లో ఉన్నారని అంటున్నారు. తమ నాయకుడిని పవన్ కల్యాణ్ పొగడ్తలతో ముంచెత్తుతూండగా.. ఆయన సోదరుడు నాగబాబు పరోక్షంలో తెగడుతూ, నియోజకవర్గంలో ప్రాధాన్యం లేకుండా చేస్తున్నారని వర్మ అనుచర వర్గం గుర్రుగా ఉంది. ఇటీవల నాగబాబు పిఠాపురంలో జరిపిన అధికారిక కార్యక్రమాల్లో వర్మ వర్గం నిరసనలతో ఈ విషయం తేటతెల్లమైందని ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన పని లేదు. మరోవైపు బంధుప్రీతితోనే మర్రెడ్డి పేరును సిఫారసు చేశారంటూ పవన్ గెలుపులో క్రియాశీలక పాత్ర పోషించిన జనసేన నేతలు నాగబాబుపై మండిపడుతున్నారు.

బీసీ సామాజికవర్గం నుంచి..

ఈ సామాజికవర్గానికి దీటుగా బీసీ సామాజి**కవర్గం గట్టి పోటీ**గా నిలుస్తోంది. ఈ వర్గం **నుంచి జనసేన** కోసం కాకినాడ రూరల్ **సీటును త్యాగం చే**సిన మాజీ ఎమ్మెల్యే పిల్లి **అనంతలక్ష్మి సత్తిబా**బు డీసీసీబీ చైర్మన్ పదవి **కోసం తగ్గేదే లేదని** గట్టి పట్టుబడుతున్నారు. **సార్వత్రిక ఎన్నికల్లో** భార్యాభర్తలిద్దరం జన**సేన కోసం శక్తివంచ**న లేకుండా పని చేశామ**ని, ఇప్పుడు సాకు**లు చెప్పి, చైర్మన్ పదవి **దక్కనీయకుండా చే**స్తే చూస్తూ ఊరుకునేది **లేదని సత్తిబాబు** వర్గం పార్టీ నేతల వద్ద బాహాటంగానే ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. డీసీసీబీ చైర్మన్‌గిరీని ఒక సామాజికవర్గానికే ఎక్కడైనా రాసిచ్చేశారా? బీసీలకు ఇవ్వకూడదా? అని ఆ వర్గం అగ్గి మీద గుగ్గిలమవుతోంది.

సంప్రదాయమనే ముసుగేసి చైర్మన్‌గిరీకి దూరం చేద్దామనుకుంటే తాడోపేడో తేల్చుకుంటామని సవాల్ చేస్తోంది. చరిత్రను తిరగరాసి ఈసారి డీసీసీబీ చైర్మన్ పదవి తమకే ఇవ్వాలని ఆ సామాజికవర్గం పట్టుబడుతోంది. ఇలా పార్టీలోని రెండు సామాజిక వర్గాలు సై అంటే సై అంటూ కయ్యానికి దిగుతూండటం టీడీపీ అధిష్టానికి మింగుడు పడటం లేదు. 'కరవమంటే కప్పకు కోపం.. అనే చందంగా పరిస్థితి తయారైందని అంటున్నారు.

పోటీలో పలువురు

మరోవైపు పొత్తులో భాగంగా కోనసీమ నుంచి కొత్తపేట సీటు త్యాగం చేసిన బండారు శ్రీనివాసరావు డీసీసీబీ పదవికి సరిపోరా అని ఆయన వర్గం ప్రశ్నిస్తోంది. కొత్తపేట నుంచి బరిలోకి దిగేందుకు అన్నీ సిద్ధ చేసుకున్న శ్రీనివాసరావు చివరి నిమిషంలో పొత్తు ధర్మం, సోదరుడు మాజీ ఎమ్మెల్యే సత్యానందరావు కోసం కట్టుబడి పని చేస్తే కనీసం డీసీసీబీ పదవికైనా పరిశీలనలోకి తీసుకోకపోతే పార్టీపై కేడర్‌లో విశ్వాసం ఎలా ఉంటుందని వారు ప్రశ్నిస్తున్నారు. మర్రెడ్డి శ్రీనివాస్‌తో పాటు కాకినాడ సిటీలో ముత్తా శశిధర్, సంగిశెట్టి అశోక్, జగ్గంపేటలో తుమ్మలపల్లి రమేష్ వంటి నేతలు జనసేన కోసం పని చేయలేదా అని పార్టీ శ్రేణులు నిలదీస్తున్నాయి. వీరందరినీ కాదని కేవలం పిఠాపురంలో బంధువైన మర్రెడ్డికి ప్రొటోకాల్ ఇవ్వాలని, వర్మకు ముకుతాడు వేయాలనే అజెండాతోనే నాగబాబు లాబీయింగ్ చేస్తున్నారని జనసేన శ్రేణులు మండిపడుతున్నాయి. దీని ద్వారా పార్టీ శ్రేణులకు ఏరకమైన సందేశాన్ని ఇస్తున్నారో అర్థం కావడం లేదనే చర్చ వాడీ వేడిగా జరుగుతోంది. చివరకు డీసీసీబీ పీఠంపై ఎవరిది పైచేయి అవుతుందో వేచి చూడాల్సిందే.

బదిలీల సమయం

- ఇంటర్మీడియెట్ విద్యలో బదిలీలకు కసరత్తు
- టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి కౌన్సెలింగ్ ద్వారా నిర్వహణ
- ప్రాధాన్యతా కేటగిరీకి తాజా ధ్రువీకరణ పత్రాల పరిశీలన
- పూర్తి స్థాయి మార్గదర్శకాల కోసం ఎదురుచూపులు

రాయవరం: ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాలు విడుదలై, సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు అధికారులకు సన్నద్ధమవుతున్న వేళ.. బదిలీలకు రంగం సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఇంటర్ బోర్డు విద్యార్థులకు వేసవి సెలవులు ప్రకటించింది. జూన్ 2న జూనియర్ కళాశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈలోగా మే నెలలో రెగ్యులర్ ఉద్యోగులకు బదిలీలు చేపట్టాలని ఇంటర్ విద్య అధికారులు భావిస్తున్నారు. ప్రాధాన్యతా కేటగిరీలో బదిలీలు పొందే వారు ముందుగా సంబంధిత వైద్య ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాకు సంబంధించి కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రి(జీజీహెచ్)లో ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ కృతికా శుక్లా ఆదేశాలు జారీ చేశారు.

రెగ్యులర్ ఉద్యోగులకు మాత్రమే..

ఇంటర్మీడియెట్ విద్యలో రెగ్యులర్ బోధన, బోధనేతర సిబ్బందికి మాత్రమే బదిలీలు ఉంటాయని ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాలను బట్టి తెలుస్తోంది. జిల్లాలోని 12 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న సిబ్బందికి బదిలీలు జరిగే అవకాశముంది. ఇప్పటికే మెడికల్ బోర్డు ఏర్పాటు చేయడంతో బదిలీలు తప్పనిసరి అని నిర్ధారణ అయింది. ఒకే కళాశాలలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న రెగ్యులర్ ఉద్యోగులకు బదిలీలు జరిగే అవకాశముంది. ఈసారి బదిలీలు పూర్తిగా వెబ్ కౌన్సెలింగ్‌లో ఉండే అవకాశముంది. బదిలీలు ఏవిధంగా చేపడతారు.. ప్రాధాన్యతాంశాలేమిటి.. ఐదేళ్ల సర్వీసుకు కటాఫ్ తేదీకి ఏ నెలను ప్రాతిపదికగా తీసుకుంటారనే విషయాలు స్పష్టం కావాల్సి ఉంది. బదిలీలకు మాగ్జిమమ్ సర్వీస్ ఐదేళ్లుగా నిర్ధారణ కాగా, మినిమమ్ సర్వీస్‌ను ఎంతగా నిర్ణయిస్తారు, అలాగే రిక్వెస్ట్ బదిలీలుంటాయా లేదా అనేది తేలాల్సి ఉంది. బదిలీల మార్గదర్శకాలు ఏవిధంగా ఉంటాయనే దానిపై బోధన, బోధనేతర సిబ్బంది ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. బదిలీ సంకేతాలు రావడంతో రెగ్యులర్ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది మానసికంగా సిద్ధపడుతున్నారు.

ప్రాధాన్యతా కేటగిరీలు ఇలా

- ప్రాణాంతక, దీర్ఘకాలిక వ్యాధులతో ప్రస్తుతం బాధ పడుతూ, చికిత్స పొందుతున్నట్లు ధ్రువపత్రం ఇచ్చిన వారికి మాత్రమే బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తారు. గతంలో వ్యాధులతో బాధ పడి కోలుకున్న వారికి ప్రాధాన్యతా కేటగిరీ వర్తింపజేయమని గురువారం నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో ఉన్నతాధికారులు స్పష్టం చేసినట్లు ప్రిన్సిపాల్స్ చెబుతున్నారు.
- ఉద్యోగి లేదా స్పౌజ్ లేదా ఉద్యోగిపై ఆధారపడిన పిల్లలు ప్రాణాంతక వ్యాధులు కలిగి ఉన్నా, అటువంటి వ్యాధులతో చికిత్స పొందుతున్నా ప్రాధాన్యతా కేటగిరీగా పరిగణిస్తారు.
- క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, మేజర్ న్యూరో సర్జరీ, బోన్ టీబీ, కిడ్నీ మార్పిడి/డయాలసిస్, అవయవ మార్పిడి, స్పైనల్ సర్జరీ చేయించుకున్న వారిని ప్రాధాన్యతా కేటగిరీగా గుర్తించే అవకాశముంది.
- మానసిక వ్యాధులతో బాధ పడుతూ చికిత్స పొందుతున్న చిన్నారులు లేదా తలసేమియా/హిమోఫీలియా/కండరాల క్షీణత, గుండెలో రంధ్రం ఉన్న చిన్నారులు కలిగిన వారిని, గత మూడేళ్లుగా చికిత్స పొందుతూ సర్జరీ చేయించుకున్న వారిని కూడా ప్రాధాన్యతా కేటగిరీలుగా గుర్తిస్తారు.
- అటువంటి వారు కాకినాడ జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన మెడికల్ బోర్డులో ధ్రువీకరణ పత్రాలు తీసుకుని, బదిలీ సమయంలో సమర్పించాల్సి ఉంటుంది.

పర్యాటకాభివృద్ధికి పెట్టుబడుల ఆహ్వానం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: జిల్లాలో ఆలయ, బీచ్ పర్యాటక రంగ అభివృద్ధి, నిర్వహణకు వివిధ రిసార్ట్స్, హోటల్, రెస్టారెంట్ పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నామని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. కాకినాడకు చెందిన అగామి ఫుడ్స్, హైదరాబాద్‌కు చెందిన హోటల్స్, రిసార్ట్స్ ఏఆర్ఆర్‌బీఐ గ్రూప్ ప్రతినిధులతో కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో.. జిల్లా పర్యాటకాధికారి వెంకటాచలం పర్యాటక రంగ అభివృద్ధి అవకాశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్వదేశీ దర్శన్ స్కీమ్‌లో వైనతేయ నదికి దగ్గరగా పాసర్లపూడి, ఆదుర్రు (బౌద్ధ స్తూపం), సముద్ర ముఖ ద్వారం వద్ద రిసార్ట్స్, రెస్టారెంట్లు, బోటింగ్ వంటి అవకాశాలున్నాయని తెలిపారు. ఎస్.యానాం సముద్ర తీరంలో రిసార్ట్స్, వాటర్ స్పోర్ట్స్ వంటి వాటికి మూడెకరాల భూములున్నాయన్నారు. కోటిపల్లి వద్ద గోదావరి తీరంలో ఇప్పటికే ఉన్న రిసార్ట్స్‌ను వినియోగంలో తెచ్చేందుకు అవకాశాలున్నాయని చెప్పారు. వీటిపై ఆయా సంస్థల ప్రతినిధులు అధ్యయనం చేసి, అభివృద్ధికి యోచన చేయాలని సూచించారు. ద్రాక్షారామ, కోటిపల్లి. అంతర్వేది, ర్యాలి, వాడపల్లి వంటి 20 పెద్ద దేవాలయాలతో పాటు 17 బీచ్‌లను సందర్శించేలా ఆలయ, బీచ్ సర్క్యూట్ టూరిజానికి అవకాశాలున్నాయని వివరించారు. ఆత్రేయపురం మండలం పేరవరంలో పిచ్చుకలంక, చింతలమోరి బీచ్, లొల్లలాకుల పర్యాటక ప్రాంతాలు జిల్లాలో ఉన్నాయన్నారు. తీర ప్రాంతం వెంబడి టీవీ సీరియల్స్, సినిమాల చిత్రీకరణ జరుగుతోందన్నారు. వారికి సంప్రదాయకంగా రిసార్ట్స్, హోటల్స్, స్టే హోమ్స్ నిర్మిస్తే మరింత అభివృద్ధికి అవకాశాలు వస్తాయని కలెక్టర్ చెప్పారు. సమావేశం అనంతరం పర్యాటక అధికారులతో కలసి ఆయా సంస్థల ప్రతినిధులు బీచ్, ఆలయాల సందర్శనకు వెళ్లారు. సమావేశంలో జిల్లా పర్యాటక ప్రాంతీయ సంచాలకులు సీహెచ్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఎన్‌డీఏ రాక్షస పాలన

- వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులకు పాల్పడితే బుద్ధి చెబుతాం
- మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డికి పార్టీ నేతల సంఘీభావం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు. చిత్రంలో మాజీ మంత్రి తానేటి వనిత, వైఎస్సార్ సీపీ నేతలు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు తదితరులు

పెదపూడి: రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలును పక్కన పెట్టి, ఎన్డీఏ ప్రభుత్వం రాక్షస పాలన సాగిస్తోందని వైఎస్సార్ సీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మండిపడ్డారు. పార్టీ అనపర్తి నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిపై పెదపూడిలో గురువారం రాత్రి టీడీపీ, ఎన్‌డీఏ కూటమి మూకలు దాడికి ప్రయత్నించాయి. ఈ నేపథ్యంలో ఆయనకు వైఎస్సార్ సీపీ కీలక నేతలు శుక్రవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ అనపర్తి కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాజీ మంత్రి వేణు మాట్లాడుతూ, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అక్రమాలు, అవినీతిని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి ఎండగడుతున్నారని, దీనిని తట్టుకోలేక దాడికి ప్రయత్నించడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. రాష్ట్రంలో బడుగు బలహీనవర్గాలే లక్ష్యంగా ఎన్‌డీఏ ప్రభుత్వం దాడులకు తెగబడుతోందని మండిపడ్డారు. దీనిపై ప్రజలు త్వరలోనే తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా మాట్లాడుతూ, శాంతికి మారుపేరుగా, మంచితనానికి మచ్చుతునకగా, నలుగురికీ చేతనైన సాయం చేస్తూ సౌమ్యంగా, గాంధీలా ఉండే డాక్టర్ సూర్యనారాయణరెడ్డిని అల్లూరిగా మార్చి తప్పు చేస్తున్నారని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక నియోజకవర్గంలో జరుగుతున్న ఒక్కో సంఘటనతో డాక్టర్ సూర్యనారాయణరెడ్డి రోజురోజుకూ రాటుదేలుతున్నారని అన్నారు. ఇక ఆయనను తట్టుకోవడం ఎమ్మెల్యే నల్లమిల్లి వల్ల కాదని అన్నారు. డాక్టర్ సూర్యనారాయణరెడ్డిపై జరిగిన దాడి ఘటనను వదిలిపెట్టేదే లేదన్నారు. ఈ ఘటనను రాష్ట్ర స్థాయిలో ప్రతిఘటిస్తామన్నారు. ప్రజాస్వామ్యంలో రౌడీయిజం ఎల్లకాలం చెల్లదన్నారు. వైఎస్సార్ సీపీ రౌడీయిజం చేయాలనుకుంటే నియోజకవర్గ గ్రామాల్లో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని తిరగనియ్యరని రాజా హెచ్చరించారు. మాజీ హోం మంత్రి, పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి తీవ్ర దౌర్జన్యకాండకు పాల్పడుతోందని, దీనికి ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు కూడా పార్టీ శ్రేణులనుద్దేశించి ప్రసంగించారు.

కార్యకర్తలు అండగా ఉండగా ఏమీ చేయలేవు

వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉండగా తనను ఎమ్మెల్యే నల్లమిల్లి ఏమీ చేయలేరని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. నియోజకవర్గంలో పార్టీ సోషల్ మీడియా ప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులపై అనేక దాడులు చేశారని చెప్పారు. దీని ద్వారా ఎమ్మెల్యే అనుకున్న లక్ష్యం నెరవేరకపోవడంతో నేరుగా తనను అంతమొందించేందుకు పెదపూడి గ్రామంలో దాడి చేయించారని ఆరోపించారు. కార్యకర్తలను, నాయకులను బెదిరిస్తే బెదిరిపోయే పని కాదని భావించి, ఏకంగా తనను అంతమొందించేందుకు ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రయత్నించారని అన్నారు. తాను అన్నిటికీ సిద్ధపడే రాజకీయాల్లోకి వచ్చానని, ఏమాత్రం వెనకడుగు వేసేదే లేదని స్పష్టం చేశారు. ఇక నుంచి ప్రతి క్షణం ఎమ్మెల్యే అక్రమాలు, తప్పులను ఎండగడుతూనే ఉంటానని అన్నారు. ఎమ్మెల్యే వల్ల ఇబ్బంది పడిన ప్రతి వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యుడూ రెట్టింపు ప్రతీకారం తీర్చుకునే సమయం దగ్గరలోనే ఉందని, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ప్రతీకారం తీర్చుకోవడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఎవరినైనా ఇబ్బంది పెడితే, వారు ధైర్యంగా ముందుకు వస్తే అన్ని విధాలా రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకత్వం అండగా ఉంటుందని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రంగంపేట జెడ్పీటీసీ సభ్యుడు లంక చంద్రన్న, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, జిల్లా పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి తాడి సూరారెడ్డి, బిక్కవోలు మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కొండేటి భీమేష్, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు వల్లభశెట్టి సతీష్, నియోజకవర్గ వీవర్స్ విభాగం అధ్యక్షుడు పప్పు సింహాచలం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాంబత్తుల చంటి, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల రమణ, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొల్లాటి ఇజ్రాయేలు, అనపర్తి గ్రామ పార్టీ కన్వీనర్ మురళీబాలకృష్ణారెడ్డి, పార్టీ నాయకుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డిపై దాడి దారుణం

రాజమహేంద్రవరం సిటీ: తమ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిపై టీడీపీ గూండాలు దాడికి పాల్పడటం దారుణమని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడిని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన తీవ్రంగా ఖండించారు. పెదపూడి మండలం దోమాడలో ఇళ్ల కూల్చివేతకు గురైన బాధితులను పరామర్శించి, వారికి బియ్యం పంపిణీ చేసి తిరిగి వస్తుండగా డాక్టర్ సూర్యనారాయణరెడ్డిపై టీడీపీకి చెందిన కొంతమంది దాడికి పాల్పడ్డారన్నారు. బాధితుల పక్షాన నిలబడి, ధైర్యం చెప్పి తిరిగి వస్తున్న క్రమంలో టీడీపీ గూండాలు ఒక పథకం ప్రకారమే ఈ దాడికి ప్రయత్నించినట్లు కనిపిస్తోందన్నారు. హైదరాబాద్‌లో ఉన్న డాక్టర్ గూడూరి అక్కడి నుంచి డాక్టర్ సూర్యనారాయణరెడ్డిని ఫోనులో పరామర్శించారు.

క్లుప్తంగా

కాలువలో పడి హోం గార్డు మృతి

మలికిపురం: రాజోలు పోలీస్‌స్టేషన్‌లో హోం గార్డుగా పనిచేస్తున్న చెల్లుబోయిన దుర్గాప్రసాద్ (32) ప్రమాదవశాత్తూ కేశనపల్లి సమీపంలో శంకరగుప్తం మేజరు డ్రైన్‌లో పడి మృతి చెందినట్లు ఎస్సై పి.వి.సురేష్ తెలిపారు. గురువారం కాలువలో గుర్తు తెలియనిదిగా భావించిన మృతదేహం కుటుంబ సభ్యుల సాయంతో హోం గార్డుగా గుర్తించినట్లు ఆయన వివరించారు. పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశామన్నారు.

రైలు నుంచి జారిపడి..

తుని: తుని-గుల్లిపాడు మధ్యలో పీఎల్ పురం వద్ద రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని (35) ఏళ్ల వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం అందిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి తెలిపిన వివరాల ప్రకారం. రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వంగపండు రంగు ఫుల్ చేతుల చొక్కా, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. ట్రాక్ దగ్గరలో మొబైల్ ఫోన్ ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వ్యక్తి దుర్మరణం

కొవ్వూరు: పట్టణ శివారున ఏషియన్ పెయింట్స్ గోదాము సమీపంలో నేషనల్ హైవేపై శుక్రవారం రాత్రి రాజమహేంద్రవరానికి చెందిన కోరుమిల్లి రాజు(40) మోటారు సైకిల్‌పై వెళుతూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మరమ్మతుల్లో భాగంగా రోడ్డును తవ్వి గోతులుగా చేశారు. మోటారు సైకిల్ అదుపు తప్పడంతో కింద పడ్డాడు. రోడ్డు అంచుకి బలంగా తలగడంతో తల భాగం పూర్తిగా నుజ్జు నుజ్జు అయ్యింది. దీంతో తీవ్ర రక్తస్రావం అయ్యి రాజు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పట్టణ సీఐ పి.విశ్వం, సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొవ్వూరు ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. మృతుడు రాజమహేంద్రవరం నుంచి ఐ.పంగిడి వైపు వెళుతుండగా ప్రమాదానికి గురైనట్లు గుర్తించారు. మృతుడి పూర్తి వివరాలు తెలియరాలేదు.

ప్రమాదవశాత్తూ ..

తాళ్లరేవు: ఇంజరం పంచాయతీ ఊటకాలువ గట్టు వద్ద ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ డ్రైవర్ పిల్లి వెంకటేశ్వరరావు(55) మృతి చెందాడు. కోరంగి ఎస్సై పి.సత్యన్నారాయణ తెలిపిన వివరాల మేరకు యానాం గణపతినగర్‌కు చెందిన వెంకటేశ్వరరావు ఇంజరం పంచాయతీలో కొన్నిరోజులుగా ట్రాక్టర్‌తో దుక్కుదున్నే పనిచేస్తున్నాడు. శుక్రవారం పనిముగించుకుని తిరిగివెళుతూ స్థానిక ఊటకాలువ వద్ద దుక్కు దున్నే పరికరాన్ని ట్రాక్టర్‌కు అమర్చే క్రమంలో అకస్మాత్తుగా ట్రాక్టర్ గేరు పడడంతో ఆ పరికరం కింద నలిగిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బొప్పాయికి రింగ్ స్పాట్

- మొక్కతోటలపై ప్రభావం అధికం
- సస్యరక్షణ చర్యలు తప్పనిసరి



మల్లేశ్వరంలో బొప్పాయి తోట



ఆకుముడత తెగులు సోకిన బొప్పాయి మొక్క



రింగ్‌స్పాట్ వైరస్ సోకి తీగల్లా మారిపోతున్న బొప్పాయి ఆకులు



బొప్పాయి పంటపై ఎల్లోమొజాయిక్ తెగులు సోకిన ఆకులు

పెరవలి: జిల్లాలో బొప్పాయి తోటలు 200 హెక్టార్లలో సాగు జరుగుతుండగా ఒక్క నిడదవోలు నియోజకవర్గంలోనే 50 హెక్టార్లలో ఈ పంట పండిస్తున్నారు. పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు, చాగల్లు, దేవరపల్లి, కడియం, కొవ్వూరు, మండలాల్లో కూడా ఈ పంటను సాగు చేస్తున్నారు. బొప్పాయి తోటలపై మొజాయిక్, రింగ్‌స్పాట్, ఆకుముడత వంటి తెగుళ్లు ఎక్కువగా ఆశించి ఉండటంతో మొక్కల్లో ఎదుగుదల ఆగి తోటలు పాడైపోతున్నాయని కొవ్వూరు ఉద్యానవన అధికారి సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. వీటిపై వచ్చే తెగుళ్లు, సస్యరక్షణ చర్యలు, ఎరువుల యాజమాన్యం గురించి ఆయన వివరించారు.

రింగ్‌స్పాట్ వైరస్

ఈ తెగులు తెల్లదోమ, పచ్చదోమ, పేనుబంక పురుగులతో వ్యాప్తి చెందుతుంది. తెగులు సోకిన మొక్కల ఆకుల పరిమాణం తగ్గి సన్నటి తీగవలె మారుతాయి. కాయలు, కాండం పైన ఉంగరం లాంటి మచ్చలు ఏర్పడి నాణ్యతను కోల్పోయేలా చేస్తాయి. పండ్లు ముగ్గినప్పుడు రింగ్ ఏర్పడినచోట వాసన వస్తుంది.

నివారణ చర్యలు

బొప్పాయి పంట సాగుచేసే రైతులు మొక్కలు నాటిన 20 రోజుల తరువాత వేపనూనెను 5 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఈ తెగులును వ్యాప్తిచేసే దోమను నివారించవచ్చు. తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటే ఎసిటామిప్రిడ్ ఎకరానికి 40 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేదా డయోమిథాగ్జామ్ 10లీటర్ల నీటికి 3 మిల్లీలీటర్ల మందును కలిపి పిచికారీ చేస్తే తెగులును నివారించవచ్చు.

ఆకుముడత తెగులు

ఈ తెగులు పురుగుల వల్ల వైరస్ వ్యాప్తిచెంది తీవ్ర నష్టాన్ని కలుగుతుంది. తెగులు ఆశించిన మొక్కల్లో ఆకులు ముడుచుకుని పోతాయి. తెగులు తీవ్రత ఎక్కువగా ఉంటే ఆకులు ఉండలుగా మారి వికృత రూపం దాల్చుతాయి. కాయలు సహజ ఆకారాన్ని కోల్పోయి వంకరటింకరగా తయారవుతాయి. దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. ఈ తెగులును రసం పీల్చే పురుగులైన తెల్లదోమ, పేనుబంకలు వ్యాప్తి చేస్తాయి.

పాడి-పంట

నివారణ చర్యలు

ఎసిటామిప్రిడ్ ఎకరానికి 40 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేదా డయోమిథాగ్జామ్ 10లీటర్ల నీటికి 3 మిల్లీలీటర్ల మందును కలిపి పిచికారీ చేస్తే తెగులును నివారించవచ్చు.

మొజాయిక్

ఇది వైరస్ వలన పంటను ఆశిస్తుంది. ఆకుల పైన పసుపు వర్ణం, ఆకుపచ్చ వర్ణం కలిగిన కణజాలం తయారై మొజాయిక్ లక్షణాలు కనబడతాయి. ఈ తెగులు సోకిన ఆకులు క్రమేపీ పసుపు వర్ణంలోకి మారి రాలిపోతాయి. తెగులు సోకిన చెట్టు కాయ పరిమాణం తగ్గి నాణ్యత కోల్పోతుంది. ఈ తెగులును తెల్లదోమ వ్యాప్తి చేస్తుంది.

నివారణ చర్యలు

బొప్పాయి పంట సాగుచేసే రైతులు మొక్కలు నాటిన 20 రోజుల తరువాత వేపనూనెను 5 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఈ తెగులును వ్యాప్తి చేసే దోమను నివారించవచ్చు. తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటే ఎసిటామిప్రిడ్ ఎకరానికి 40 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేదా డయోమిథాగ్జామ్ 10 లీటర్ల నీటికి 3 మిల్లీలీటర్ల మందును కలిపి పిచికారీ చేస్తే తెగులును నివారించవచ్చు.

ఎరువుల యాజమాన్యం



బొప్పాయి మొక్కలకు ఎరువులు ఎక్కువ మోతాదులో అవసరం ఉంటుంది. మొక్కలు నాటినప్పుడే కాక ప్రతీ మొక్కకు రెండునెలలకు ఒకసారి 90 గ్రాముల యూరియా, 250 గ్రాములు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 150 గ్రాములు మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేయాలి. ఇలా సంవత్సరానికి 6 దఫాలుగా ఎరువులు వేస్తే మొక్కకు మంచి పోషకాలు అందుతాయి. ఈ విధంగా ఎరువులు వినియోగించడం వల్ల మొక్కకు మంచి పోషకాలు అంది అధిక దిగుబడిని అందిస్తాయి. సస్యరక్షణ చర్యలు సకాలంలో చేపటినప్పుడు తెగుళ్లను నివారించవచ్చు.

-సీహెచ్ శ్రీనివాస్, ఉద్యాన అధికారి, కొవ్వూరు

రెండు జేసీబీల స్వాధీనం



జేసీబీలను సీజ్ చేసిన మైన్స్ అధికారులు

పి.గన్నవరం: గడువు ముగిసినా మానేపల్లి లంక నుంచి పెదకందాలపాలెం ర్యాంపు మీదుగా అక్రమంగా మట్టి తరలిస్తున్న నేపథ్యంలో మైన్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. పెదకందాలపాలెం వద్ద ర్యాంపులో ఉన్న రెండు జేసీబీలను సీజ్ చేశారు. మానేపల్లిలంక నుంచి హైవే పనులకు మట్టి తీసేందుకు గడువు ముగిసిందని మైన్స్ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ర్యాంపులో పని చేస్తున్న రెండు జేసీబీలు సీజ్ చేసినట్టు మైన్స్ ఆర్ఐ సుజాత తెలిపారు. గడువు ముగిసిన నేపథ్యంలో ఈ ర్యాంపుల నుంచి మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. మైన్స్ టెక్నికల్ అసిస్టెంట్ రెహమాన్ అలీ, మానేపల్లి వీఆర్వో నాగన్న ఆమె వెంట ఉన్నారు.

అంతర్ జిల్లా దొంగల అరెస్టు

- రూ.41,50,000 విలువగల వాహనాలు, నగలు, వెండి, నగదు స్వాధీనం
- 25 కేసుల్లో నిందితులుగా గుర్తింపు



బిక్కవోలులో నిందితులను, స్వాధీనం చేసుకున్న వస్తువులను చూపుతున్న ఈస్ట్‌జోన్ ఇన్‌చార్జి డీఎస్పీ భవ్యకిషోర్

బిక్కవోలు: అంతర్ జిల్లా దొంగల ముఠాకు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు, నగలు, వస్తువులు స్వాధీనం చేసుకున్నట్టు ఈస్ట్‌జోన్ ఇన్‌చార్జి డీఎస్పీ ఎం.భవ్యకిషోర్ తెలిపారు. శుక్రవారం ఆమె బిక్కవోలు పోలీస్ స్టేషన్ వద్ద మాట్లాడారు. ఈ ఏడాది అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం తామరం గ్రామానికి చెందిన దల్లి కామిరెడ్డి, చినరాచపల్లి గ్రామానికి చెందిన కచ్చల చిరంజీవి, జంగాలపల్లి గ్రామానికి చెందిన సఖిలేటి సాయి, గిడుతూరు గ్రామానికి చెందిన వల్ల శ్రీను జనవరి 9 తేదీన బిక్కవోలు మండలం బలభద్రపురంలో మూడు చోట్ల చోరీ యత్నం చేశారు. విశాఖపట్నం జిల్లా ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగలించిన బ్రీజా కారుపై వీరు బలభద్రపురం వచ్చారు. వెల్డింగ్ షాపులో గ్యాస్ సిలిండర్లు, గ్యాస్ కట్టర్ల చోరీతో పాటు ఏటీఎంలో దొంగతనం, నగల షాపులో చోరీ ప్రయత్నం చేశారు. అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ కెమెరాల సాయంతో నలుగురు ముద్దాయిల్లో ఒకరు అయిన సాయిని గుర్తించారు. అతనిని మార్చి 3వ తేదీన తుని రైల్వేస్టేషన్ వద్ద బిక్కవోలు పోలీసులు అరెస్టు చేశారు. కొయ్యలగూడెంలో దొంగలించిన బైక్‌ను స్వాధీనం చేసుకొని అతనిని రిమాండ్‌కు పంపించారు. కచ్చల చిరంజీవి మాకవరపుపాలెం పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. మిగిలిన ఇద్దరు నిందితులు దల్లి కామిరెడ్డి, వల్ల శ్రీనును గురువారం సాయంత్రం 4గంటలకు తుని రైల్వే స్టేషన్ వద్ద అనపర్తి సీఐ సుమంత్, ఎస్సై రవిచంద్రకుమార్ తన బృందంతో అరెస్టు చేశారు. వారిపై తూర్పుగోదావరి జిల్లాలో 3, కాకినాడ జిల్లా 11, అనకాపల్లి జిల్లా 7, ఏలూరు జిల్లా 1, శ్రీకాకుళం జిల్లా 2, విశాఖ జిల్లాలో 1 కేసులు ఉన్నాయి. వీరి నుంచి 71 గ్రాముల బంగారు వస్తువులు, 1.02 కిలోల వెండి వస్తువులు, రూ. 9,80,000 నగదుతో పాటు మూడు బైకులు, ఒక కారు, దొంగతనానికి ఉపయోగించిన వాహనాలు, గ్యాస్ కట్టర్‌తో పాటు రూ.41,50,000 విలువగల వస్తువులు స్వాధీనం చేసుకున్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,000
గటగట (వెయ్యి)	18,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

జీడిపండుకు మూడు గింజలు!




మూడు గింజలు ఉన్న జీడిపండు

మలికిపురం: మండలంలోని పడమటిపాలెం గ్రామంలో అంబటి లక్ష్మీ నారాయణకు చెందిన జీడి తోటలో ఒక చెట్టుకు కాసిన జీడిపండుకు మూడు గింజలు ఉన్నాయి. సాధారణంగా ఒక పండుకు ఒకే గింజ ఉంటుంది. కానీ ఇక్కడ మూడు గింజలు ఉండటం స్థానికులను ఆశ్చర్యపరచింది.

ఇంటర్ ఫీజు చెల్లింపునకు 5 వరకూ అవకాశం

అమలాపురం టౌన్: ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకూ జరగనున్న అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లింపునకు రెండు రోజులు గడువు పెంచినట్లు డీఐఈవో వనుము సోమశేఖరరావు తెలిపారు. కొంతమంది విద్యార్థులకు మరికొంత సమయం ఇస్తే ఫీజు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారని ఇంటర్మీడియెట్ బోర్డు దృష్టికి వెళ్లినట్లు డీఐఈవో స్పష్టం చేశారు. దీంతో విద్యార్థులు ఫీజు చెల్లించేందుకు చివరి అవకాశంగా ముందు నిర్దేశించిన ఈనెల 3వ తేదీని 5వ తేదీ వరకూ రెండు రోజుల పాటు పెంచినట్లు ఆయన వివరించారు. ఈ గడువు పెంపుతో పాటు ఆ లోపు ఫీజు చెల్లించే విద్యార్థులు అపరాధ రుసుము లేకుండా చెల్లించే అవకాశాన్ని బోర్డు కల్పించిందని ఆయన వెల్లడించారు. ఇంటర్మీడియట్ బోర్డు శుక్రవారం సాయంత్రం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన అరవింద్

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లో మట్లపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చింతా అరవింద్ అనే యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు యానాంకు చెందిన అరవింద్ కోరింగా కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఫార్మ్‌డి కోర్సు చదువుతున్నాడు. కాకినాడ నుంచి ద్విచక్రవాహనంపై యానాం వెళుతుండగా మట్లపాలెం లేఅవుట్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో అరవింద్ తలకు తీవ్ర గాయమై రక్తస్రావమైంది. స్థానికులు హుటాహుటిన కాకినాడ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

బంగారు ఆభరణాల చోరీ

అన్నవరం: గ్రామ శివార్లలోని కొత్తపేటలో ఒక కుటుంబం ఊరెళ్లిన విషయం పసిగట్టిన దొంగలు ఇంటి తలుపుల తాళం బద్దలు కొట్టి రూ.పది లక్షల విలువైన 98 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించారు. అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేటకు చెందిన వి.విజయ గత నెల 29న విశాఖపట్నంలోని తన అమ్మగారి ఇంటికి వెళ్లారు. అయితే శుక్రవారం ఉదయం ఆమె ఇంటికి ఎదురుగా ఉన్న వారు ఆమెకు ఫోన్ చేసి మీ ఇంటి తలుపు తాళం బద్దలు కొట్టి ఉందని తెలిపారు. దీంతో ఆమె విశాఖపట్నం నుంచి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపులతో బాటు బీరువాలోని లాకర్ తాళం బద్దలు కొట్టి సుమారు 98 గ్రాముల బంగారం అపహరించిన విషయం వెల్లడైంది. దీంతో ఆమె స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ వచ్చి ఇంటిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జీజీహెచ్ మేల్ నర్సు సస్పెన్షన్

త్రిసభ్య కమిటీ విచారణ మేరకు కలెక్టర్ నిర్ణయం



శ్రీనివాసరావు

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు మేల్ నర్సు పోలాబత్తిన శ్రీనివాసరావును కలెక్టర్ షణ్మోహన్ ఆదేశాల మేరకు అధికారులు ఉద్యోగం నుంచి సస్పెండ్ చేశారు. ఈ మేరకు, సస్పెన్షన్ ఉత్తర్వులు వెలువడ్డాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు, జీజీహెచ్ సూపరింటెండెంట్ సూచనలతో నర్సింగ్ విభాగం అధికారులు ఈ ఉత్తర్వులను శుక్రవారం శ్రీనివాసరావుకు అందజేశారు. 2025 రిపబ్లిక్ డే పురస్కారాలకు ప్రతిభ ఆధారంగా స్వయానా కలెక్టర్ ఆమోదం మేరకు ఎంపిక అయి అవార్డులు అందుకున్న తన తోటి నర్సింగ్ సిబ్బందిని శ్రీనివాసరావు వాట్సాప్ వేదికగా తీవ్ర పదజాలంతో మహిళలు అని కూడా కనీసం గౌరవం చూపక అవమానపరుస్తూ పోస్టులు పెట్టాడని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ క్రమంలో వారిని ఎంపిక చేసిన కలెక్టర్, జీజీహెచ్ సూపరింటెండెంట్, హెచ్‌వోడీలు, నర్సింగ్ సూపరింటెండెంట్‌ల నిర్ణయాన్ని కూడా నిరాధార వ్యాఖ్యలతో తప్పుబట్టాడని ఆదేశాల్లో ప్రస్తావించారు. తాను చేసే ఆరోపణలకు నర్సింగ్ వర్గాల నుంచి మద్దతు ఉందని నమ్మించేందుకు ఖాళీ పత్రాలపై సంతకాలు సేకరించాడని, ఎందుకు ఖాళీ పత్రాలపై సంతకాలు సేకరిస్తున్నావని నర్సులు అడిగితే మన సమస్యలను ఉన్నతాధికారులకు, నాయకులకు నివేదించేందుకని నమ్మబలికాడని ఆదేశాల్లో తెలిపారు. ఏపీ ఎన్‌జీవో, జిల్లా నర్సింగ్ అసోసియేషన్ల సూచనలతోనే తాను ఇలా సంతకాల సేకరణ చేపడుతున్నానని నర్సులతో అన్నాడని, ఈ విషయంపై ఆయా సంఘాల నాయకులు తమకేమీ సంబంధం లేదని, తమ సంఘాల పేర్లను వ్యక్తిగత వైషమ్యాల కోసం వాడుకుంటున్నాడని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారని సస్పెన్షన్ ఆర్డర్‌లో ప్రస్తావించారు. సంతకాల సేకరణ ఈ ఏడాది జనవరి 30వ తేదీన రాత్రి 10.30 కి ప్రారంభించి అర్ధరాత్రి వరకు కొనసాగిస్తూ నర్సుల విధులకు శ్రీనివాస్ ఆటంకం కలిగించాడని ఆర్డర్‌లో పేర్కొన్నారు. సదరు ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ కలెక్టర్ విచారణాధికారిగా త్రిసభ్య కమిటీని నియమించి శ్రీనివాసరావుపై విచారణ నిర్వహించి వివరణ కోరామని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. విచారణలో వాస్తవాలు స్పష్టం కావడంతో పాటు సంతకాలు పెట్టిన నర్సులు, నాయకులు శ్రీనివాసరావుపై ఫిర్యాదులు చేశారని ప్రస్తావించారు. అతడి వివరణ సైతం అసంబద్ధంగా ఉందని, శ్రీనివాస్ వివరణతో కూడిన విచారణ నివేదికను కలెక్టర్‌కు సమర్పించినట్లు ఆదేశాల్లో స్పష్టం చేశారు. విచారణలోని వాస్తవాల ఆధారంగా శ్రీనివాసరావుపై కలెక్టర్ సస్పెన్షన్ వేటుకు ఆదేశాలిచ్చారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చంద్రప్రభ వాహనంపై వీరేశ్వరుడు



చంద్రప్రభ వాహనంపై ఊరేగుతున్న భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి

వైభవంగా రుద్రహోమం

ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు రెండో రోజు వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాలు శైవాగమ పద్ధతిలో స్వర్ణ రుద్రాక్ష కంకణ, స్వర్ణ సింహతలాట సన్మాన గ్రహీత, రాష్ట్ర ఆదిశైవ అర్చక సంఘ అధ్యక్షుడు యనమండ్ర సత్యసీతారామ శర్మ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. శుక్రవారం ఆలయంలో ఉదయం గవ్యాంతం, పంచవింశతి కలశ స్థాపన పూర్వక అభిషేకం, లక్ష్మీగణపతి హోమం, రుద్రహోమం నిర్వహించారు. సాయంత్రం భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించిన చంద్ర ప్రభ వాహనంపై ఊరేగించారు. ఈ ఉత్సవాలలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లను ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ పర్యవేక్షిస్తున్నారు. బ్రహ్మోత్సావాల సందర్భంగా ఆలయ ఆవరణలో భారీ చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు.

ఘనంగా ఆదిశంకర జయంతి

ఆదిశంకరాచార్య జయంతిని పురస్కరించుకొని మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శంకర జయంతి ఉత్సవం ఘనంగా జరిగింది. ఆలయ పురోహితులు నాగాభట్ల రామకష్ణమూర్తి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకస్వాములు, పండితులు వేదమంత్రాల మధ్య శాస్త్రోత్తంగా కార్యక్రమం నిర్వహించారు.

గంజాయి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

రాజమహేంద్రవరం రూరల్: గంజాయి కేసులో పట్టుబడ్డ ఏ2 నిందితుడు విశాఖజిల్లా గోలుగొండ మండలం లింగంపేట గ్రామానికి చెందిన బొద్దిన సురేష్‌పై నేరం రుజువు కావడంతో పదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ తూర్పుగోదావరి జిల్లా ఎన్‌డీపీఎస్ కమ్ ఒకటవ అదనపు సెషన్స్ జడ్జి ఆర్.శివకుమార్ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2017 నవంబర్ 21వ తేదీన 266 కేజీల గంజాయిని నర్సీపట్నం నుంచి వరంగల్‌కు లారీలో తరలిస్తుండగా రెండవ ముద్దాయి అయిన బొద్దిన సురేష్‌ను అప్పటి బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.నాగమోహన్‌రెడ్డి అరెస్టు చేసి కోర్టు ఉత్తర్వులు మేరకు రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం కేసు ఒకటవ అదనపు సెషన్స్ కోర్టులో విచారణకు రావడంతో సాక్షుల విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఆర్.శివకుమార్ పైవిధంగా తీర్పునిచ్చారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున పిపి.లక్ష్మణ్‌నాయక్ బలమైన వాదనలు వినిపించారు. అప్పటి దర్యాప్తు అధికారి కె.నాగమోహన్‌రెడ్డి, ప్రస్తుత బొమ్మూరు పిఎస్ ఇన్‌స్పెక్టర్ పి.కాశీవిశ్వనాథం పర్యవేక్షణలో కోర్ట్ హెడ్‌కానిస్టేబుల్ పి.విశ్వేశ్వరరావు సాక్షులను సరైన సమయంలో ప్రవేశపెట్టి శిక్ష పడ్డానికి దోహదపడ్డారు.

బీచ్ కబడ్డీ పోటీలు ప్రారంభం

- సూర్యారావుపేట సాగర తీరంలో క్రీడా సందడి
- ప్రారంభ మ్యాచ్ పురుషుల విభాగంలో తూర్పు గోదావరి జిల్లా విజయం



క్రీడాకారులు మార్చ్‌పాస్ట్



పోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, ఎమ్మెల్యే నానాజీ తదితరులు

కాకినాడ రూరల్: కాకినాడ సాగర తీరాన క్రీడా సంబరం ఆరంభమైంది. ఏపీ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 12వ రాష్ట్ర స్థాయి సీనియర్ మెన్ అండ్ వుమెన్స్ అంతర జిల్లాల బీచ్ కబడ్డీ పోటీలు కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట బీచ్‌లో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలను కలెక్టరు షణ్మోహన్, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కౌడా వైస్ చైర్‌పర్సన్ భావన, ఏపీ కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. క్రీడాకారుల నుంచి అతిథులు గౌరవ వందనం స్వీకరించారు. పూర్వపు ఉమ్మడి జిల్లాల ప్రతిపాదికన పురుషుల 13 జట్లు, మహిళల 13 జట్లు మూడు రోజులు పాటు జరగనున్న పోటీలలో పాల్గొననున్నాయి. శుక్రవారం నుంచి ఆదివారం వరకు లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీలు జరుగున్నాయి. ఫైనల్ పోరు ఆదివారం సాయంత్రం జరగనుంది. పోటీల కోసం 4 కోర్టులను ఏర్పాటు చేయడంతో పాటు ప్రేక్షకుల కోసం గ్యాలరీలను ఏర్పాటు చేశారు. ప్రారంభ మ్యాచ్‌గా పురుషుల విభాగంలో తూర్పు గోదావరి, చిత్తూరు జిల్లాలు తలపడగా తూర్పు గోదావరి జిల్లా విజయం సాధించింది. మహిళల విభాగంలో తూర్పు గోదావరి, శ్రీకాకుళం జట్లు తలపడగా శ్రీకాకుళం జట్టు విజయం సాధించింది.

కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ బీచ్ ప్రదేశాన్ని రానున్న రెండు నెలల్లో రూ.2.5కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ బీచ్ కబడ్డీ పోటీలు నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. ఏపీ కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి మాట్లాడుతూ మే 15నుంచి 20వరకు మచిలీపట్నంలో జాతీయ స్థాయి పోటీలు జరుగుతాయని, రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ చూపే వారిని ఎంపిక చేస్తామన్నారు. హౌసింగ్ పీడీ సత్యనారాయణ, డీఎం అండ్ హెచ్ఓ నరసింహనాయక్, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్, జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, కేఎస్‌పీఎల్ సీఈఓ మురళీధర్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, కబడ్డీ పోటీల ఆర్గనైజింగ్ సెక్రటీ కనపర్తి నూకరాజు పాల్గొన్నారు.

యావజ్జీవ ఖైదీకి కంటి చికిత్స

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో శుక్రవారం యావ జ్జీవ ఖైదీకి కంటి శస్త్ర చికిత్స నిర్వహించారు. సాయుధ పోలీసుల పహారా మధ్య అతనికి వైద్యం అందించారు.

అతడి పేరు నిత్యానందన్. వయసు 45 ఏళ్లు. తమిళనాడుకు చెందిన ఓ నరహంతకుడు. పది మందిపై అత్యాచారం చేసి ఏడుగురిని దారుణంగా చంపేశాడు. అతడు చేసిన నేరాలు 2020 సమయంలో తమిళనాడును కుదిపేశాయి. పాండిచ్చేరి కోర్టు అత్యంత అరుదైన నేర ప్రవృత్తిగా నిర్ధారించి నిత్యానందన్‌కు యావజ్జీవ కారాగార శిక్ష వేసింది. ఇతడిని చంపేందుకు శత్రువులు పాండిచ్చేరి జైల్‌లో ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో రెండేళ్ల క్రితం యానాం జైలుకు తరలించారు. అక్కడ కంటికి సంబంధించిన సమస్య తలెత్తింది. దీంతో శుక్రవారం శస్త్రచికిత్స నిర్వహించారు.